
ఖానాపూర్ టౌన్ : పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం

## బెల్ట్ షాపుపై దాడి.. మద్యం పట్టివేత

ఖానాపూర్ టౌన్, అక్టోబర్ 10 : ఖానాపూర్ మండలం గోసంపల్లె గ్రామంలోని బెల్ట్ షాపుపై పోలీసులు మంగళవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో పోలీసులు నిర్వహించిన ఆకస్మిక సోదాల్లో అనుమతి లేకుండా నిల్వ ఉంచిన రూ.లక్ష విలువ గల మద్యం పట్టుకున్నట్లు ఎస్ఐ లింబాద్రి తెలిపారు. అక్రమంగా మద్యం నిల్వ ఉంచిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

**నిర్మల్‌లో..**

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 10 : నిర్మల్ పట్టణ శివారులోని బెల్ట్ షాపులపై పోలీసులు తనిఖీలు చేపట్టారు. అనుమతులు లేకుండా విక్రయిస్తున్న 89 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శంకర్ తెలిపారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుళ్లు పర్వేజ్, సంతోష్, సురేష్ పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న మద్యం

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★రామకృష్ణ గ్రూప్ Hyd, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, బేబి కేర్, ఇంటి/ వంటపని చేయుటకు వర్కర్స్ కావలెను. భో|| + వ|| + జీతం: 15-22 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ఫోన్: 9281452833, 9281452844. NT-320501-All
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం, జీతం: 16K to 18K ఏజెంట్ కమీషన్ 6k. Ph: 9640468899, 9640258899. NT-310350-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆదిలాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

## అమ్మవారి ఒడి బియ్యం కానుకల లెక్కింపు

బాసర, అక్టోబర్ 10 : బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారికి భక్తులు సమర్పించిన ఒడి బియ్యం కానుకలను మంగళవారం ఆలయాధికారులు లెక్కించారు. ఇందులో 29.75 క్వింటాళ్ల ఒడి బియ్యం, 151 కిలోల ఎండు కొబ్బరి, 13.500 కిలోల నల్ల బరడి పోకలు, 34 కిలోల పసుపు కొమ్ములు, 8 కిలోల బాదం, 29 కిలోల ఎండు ఖర్జూర సమకూరినట్లు తెలిపారు. ఈ లెక్కింపులో ఆలయ సిబ్బంది, వాగ్దేవి సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పేదల చదువుకు ప్రోత్సాహం

- ఎన్ఎంఎంఎస్ ఉపకార వేతనంతో ఆసరా
- ఈ నెల 13 వరకు గడువు
- నాలుగేళ్ల పాటు ఉపకార వేతనం


సారంగాపూర్ ఉన్నత పాఠశాలలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

సారంగాపూర్, అక్టోబర్ 10 : పేద, మధ్య తరగతి విద్యార్థులకు ప్రతిభ ఉన్నా ఆర్థిక ఇబ్బందులు, ప్రోత్సాహం కరువై చదువులో రాణించడం లేదు. ఇలాంటి విద్యార్థులకు ఉపకార వేతనాల రూపంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలుస్తున్నాయి. నేషనల్ మీన్స్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)తో పాఠశాల స్థాయిలో మాధ్యమిక విద్యతో పాటు ఉన్నత చదువుల వరకు ఉపకార వేతనాలు అందిస్తున్నాయి. సారంగాపూర్ మండలంలో కొంత మంది విద్యార్థులు ఏటా ఎంపికవుతూ ఉపకార వేతనాలు అందుకోవడం విశేషం. గత ఏడాది కూడా సారంగాపూర్, ధని ఉన్నత పాఠశాలల నుంచి నలుగురు విద్యార్థులు నేషనల్ మీన్స్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారు. మరో నాలుగు రోజుల తక్కువ సమయం ఉన్నందున ఉపాధ్యాయులు విద్యార్థులను చైతన్య పర్చి దరఖాస్తు చేయిస్తున్నారు. కాగా, ఈ నెల 13 వరకు గడువును నిర్దేశించారు. అర్హత పరీక్ష నవంబర్‌లో గానీ, డిసెంబర్‌లో గానీ జరుగనున్నది.

**అర్హులు..**

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాయడానికి అర్హులు. 2022-2023 విద్యా సంవత్సరం ఏడో తరగతిలో ఓసీ, బీసీ విద్యార్థులు కనీసం 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీలు 50 శాతం మార్కులు సాధించి ఉండాలి. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. 3.50 లక్షలలోపు ఉండాలి. ప్రైవేటు, ప్రభుత్వ రెసిడెన్సియల్ పాఠశాలల్లో చదువుతున్న వారు అనర్హులు. ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాసి, ఎంపికైతే 9వ తరగతి నుంచి ఏటా రూ.12 వేల చొప్పున ఉపకార వేతనం అందిస్తారు. నాలుగేళ్లలో మొత్తం రూ.48 వేల ఉపకార వేతనం పొందవచ్చు. విద్యార్థి బ్యాంక్ ఖాతాలో ప్రభుత్వం ఈ సొమ్మును జమ చేస్తుంది.

**దరఖాస్తు ఇలా...**

కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో సంబంధిత ప్రధానోపాధ్యాయుడిని సంప్రదించాలి. లేదా www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో పాఠశాల పాస్‌వర్డ్‌తో లాగిన్ అయి దరఖాస్తు చేస్తారు. ఓసీ, బీసీ విద్యార్థులకు పరీక్ష రుసుం రూ. 100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకైతే రూ.50 వేలు చెల్లించాలి.

**అర్హత పరీక్ష ఇలా...**

ఎన్ఎంఎంఎస్ పరీక్షలో మొత్తం 180 మార్కులు ఉంటాయి. మెంటల్ ఎబిలిటీకి 90, స్కాలస్టిక్ ఆప్టిట్యూడ్ గణితం, సామాన్యశాస్త్రం, సాంఘిక శాస్త్రం 90 మార్కులు కేటాయించారు. మూడు గంటల పరీక్ష సమయం ఉంటుంది. ఇందులో జనరల్ విద్యార్థులకు 40, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 32 శాతం కనీస అర్హత మార్కులు రావాలి. ఏడో తరగతిలోని పూర్తి సిలబస్, ఎనిమిదో తరగతిలోని సిలబస్ ప్రశ్నలు వస్తాయి.

**నిరంతరం చదువుతోనే సాధ్యం..**



ఏడో తరగతిలోని ప్రధాన అంశాలను నోట్ చేసుకోవడంతో పాటు, ఎనిమిదో తరగతిలోని పాఠ్యాంశాలు క్షుణ్ణంగా చదివాను. సందేహాల నివృత్తికి ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయుల సలహాలు తీసుకున్నారు. ప్రత్యేక పుస్తకంలో నోట్ చేసుకున్నాను. మొదట్లో కొంత భయమనిపించినా చదువుతుంటే మరింత పట్టుదల పెరిగింది. ఉపకార వేతనానికి ఎంపిక కావడంతో ఇదే స్ఫూర్తితో ముున్ముందు ఉన్నత చదువుల్లో పోటీ పరీక్షల్లోనూ రాణిస్తాననే నమ్మకం కలిగింది.

- సాయిప్రసన్న, 9వతరగతి, సారంగాపూర్ ఉన్నత పాఠశాల

**మెంటల్ ఎబిలిటీపై శ్రద్ధ..**



ఎన్ఎంఎంఎస్ అర్హత పరీక్షలో మెంటల్ ఎబిలిటీకి 90 మార్కులు కేటాయించడంతో ప్రత్యేక శ్రద్ధతో సాధన చేశాను. ఉపాధ్యాయులను అడిగి అనుమానాలను నివృత్తి చేసుకున్నా. బడిలో ఉదయం, సాయంత్రం పరీక్ష కోసం ప్రత్యేకంగా చదివించారు. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో బోధన చేయడం వల్లనే అర్హత పరీక్షల్లో ప్రతిభ చాటాను. నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12 వేలు ఉపకార వేతనం అందనుండటంతో ఎలాంటి ఇబ్బందులేకుండా చదువుకునే అవకాశం ఏర్పడింది.

- అరుగుల లక్ష్మీకాంత్, 9వతరగతి, సారంగాపూర్ ఉన్నత పాఠశాల

**ప్రణాళికతో చదివితే ప్రయోజనం..**



విద్యార్థులు ప్రణాళికతో చదవాలి. మెంటల్ ఎబిలిటీ పరీక్షల్లో సులభంగా స్కోర్ చేయవచ్చని మరువద్దు. గత పరీక్ష ప్రశ్నపత్రాలను సాధన చేయాలి. పరీక్షలకు పది రోజుల ముందు గ్రాండ్ టెస్టులు రాస్తూ మార్కులు, సమయ భావం అంచనా వేసుకోవాలి. గతేడాది ఎన్ఎంఎంఎస్ పరీక్ష కోసం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాం. ఉదయం, సాయంత్రం కూడా ప్రత్యేక క్లాసులు తీసుకున్నాం. ఇద్దరు విద్యార్థులు స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారు.

- దుంపిడి శ్రీనివాస్, ఉపాధ్యాయుడు, సారంగాపూర్ ఉన్నత పాఠశాల

# మధురం.. సీతాఫలం

- పుష్కలంగా పోషకాలు
- విరివిగా కొనుగోలు చేస్తున్న జనం





తానూర్, అక్టోబర్ 10 : పేదోడి ఆపిల్‌గా పేరుగాంచిన మధురమైన ఫలం.. సీతాఫలం. నోరూరించే ఈ ఫలాన్ని ఎవరు కాదంటారు. ఊరూరా ఇంటి ఆవరణలో, శివారులోని పంట పొలాలు, గుట్టల్లో, చెరువు గట్టపై ఈ చెట్టు విరివిగ పెరుగుతాయి. సీజన్ వచ్చిందంటే చాలు నిండుగా పూతపూసి చెట్టు నిండా కాయలు కనిపిస్తాయి. కనువిందు చేస్తాయి. నిరుపేద కుటుంబాలకు ఇవి జీవనాధారమని చెప్పొచ్చు. ఇందులో అత్యధిక పోషక విలువలు, మరెన్నో ఔషధ గుణాలున్నాయి. ఈ చెట్టుకు ఎలాంటి తెగులు సోకదు. ఏ పురుగూ పట్టదు. ఈ చెట్టుకు పురుగు మందులు వాడాల్సిన అవసరమే లేదు. ఏడాది మొత్తం ఆరోగ్యంగా ఉంటూ నిండుగా పూతపూసి, తియ్యని పండ్లను ఇస్తాయి. 5-6 ఏండ్ల క్రితం వర్షాభావ పరిస్థితుల కారణంగా సీతాఫలాలు అంతంతగా కాయడంతో మార్కెట్‌లో కనిపించలేదు. ప్రస్తుతం నెర్రెలు విప్పి నోరు ఊరించేలా కనిపిస్తుండడంతో ప్రజలను ఆకర్షిస్తున్నాయి. వీటిని చూస్తుంటే సీజనల్ పండ్లు తింటే ఆరోగ్యానికి మంచిదని పెద్దలు చెప్పిన మాట గుర్తుకు రాకమానదు. చలికాలం వచ్చిందంటే చాలు మార్కెట్‌లోకి తియ్యటి వాసనతో దర్శనమిస్తాయి. తానూర్ మండలంలోని ఝరి(బీ), ఝరితండా, మొగిల, హిప్పెల్లితండా, వడ్‌ఝరి గ్రామ శివారులో ఈ సీతాఫలం పండ్లు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. కొందరు జీవనోపాధిగా కోసుకొచ్చి గ్రామాలు, మండల కేంద్రంలో విక్రయిస్తున్నారు.

**పోషకాలు అధికం..**



సీతాఫలంలో పోషకాలు అధికంగా ఉంటాయి. పండ్లు కూడా తియ్యగా ఉండడంతో ప్రతీ ఒక్కరు ఈ పండును అమితంగా ఇష్టపడతారు. మాంసకృత్తులు, కాల్షియం, పీచు, కనిజ లవణాలు విటమిన్లు విరివిగా ఉంటాయి. శరీరానికి శక్తినిచ్చే కొవ్వు పుష్కలంగా ఉంటుంది. ఈ ఫలం శరీరం పనితీరును మెరుగుపరిచి గుండె జబ్బుల నుంచి కాపాడుతుంది. సీజన్లో వచ్చే ఈ పండ్లను ప్రతీ ఒక్కరు తప్పకుండా తీసుకోవాలి.

- రమ్యగౌడ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జి వైద్యురాలు, తానూర్